
ఆంధ్రజ్యోతి



అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

తాండూరు, జూన్ 24 : హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రోడ్లు, భవనాలు, నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమీక్షించారు. వానాకాలం సీజన్ వచ్చినందుకు గ్రామాల్లో నీరు కలుషితం కాకుండా, పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కరించాలని ఆదేశించారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

వికారాబాద్, జూన్ 24: పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం అమ్మ ఆదర్శ పాఠశాలలపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ఇంజినీరింగ్ అధికారులతో జూమ్ సమీక్ష నిర్వహించారు. వారితో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో చేపట్టిన పనులు నాణ్యతగా చేయాలన్నారు. విద్యార్థులకు సంఖ్యకు అనుగుణంగా ప్రతీ 20మంది ఒక టాయిలెట్ చొప్పున ఏర్పాటు చేయించాలన్నారు. వాటికి నిరంతరం నీరందేలా చూడాలన్నారు. పాఠశాలల వివరాలను బ్లాక్‌లు, తరగతి వారీగా నంబర్లతో కూడుకున్న ఫొటోలను తనకు అందజేయాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో తాగునీరు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురిస్తే స్కూల్ భవనాలపై నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, స్కూల్ బిల్డింగ్‌లపైకి ఎక్కేందుకు నిచ్చెనలు కొనుగోలుకు చేయాలని తెలిపారు. ప్రత్యేకాధికారులు పాఠశాలల తీరుతెన్నులను గమనించి పనులు చేపట్టే చర్యలు తీసుకోవాలన్నారు. పర్యవేణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల కోసం చేసే మంచి పనులతో గొప్ప అనుభూతిని పొందాలని అధికారులతో కలెక్టర్ అన్నారు. ప్రతీ శుక్రవారం పాఠశాలలపై సమీక్ష నిర్వహిస్తానని, పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాయనున్నారని, ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధించాలని, జిల్లాలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్డీవో శ్రీనివాస్, డీఈవో రేణుకాదేవి, ఆర్అండ్‌బీ ఈఈ లాల్‌సింగ్, పీఆర్ ఉమేష్, ప్రత్యేకాధికారులు రామ్‌రెడ్డి, దీపారెడ్డి, మల్లేశం, బాబూమోజెస్, జ్ఞానేశ్వర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

పట్లూర్ ఆసుపత్రి పనితీరుపై స్పీకర్ ఆగ్రహం

మర్పల్లి, జూన్ 24: ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాల్సిన వైద్యులు విధుల్లో లేకపోవడం ఏమిటని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ మండిపడ్డారు. సోమవారం ఆయన మండలంలోని పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో ఆస్పత్రిలో ఇద్దరే నర్సులు ఉండటంతో డాక్టర్ ఎక్కడ? అని అడిగారు. ఆమె వెళ్లిపోయారని వారు చెప్పడంతో టైం కాకుండానే ఎలా వెళ్తారని అన్నారు. చికిత్సల కోసం రోగులొస్తే వైద్యం ఎవరు చేస్తారని ప్రశ్నించారు. వెంటనే స్పీకర్ డీఎంహెచ్‌వోకు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో కలెక్టర్‌కు ఫోన్‌చేసి పట్లూర్ ఆసుపత్రి పనితీరుపై వివరించారు. ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని, విధులకు హాజరు కాలేదని, వచ్చే రోగులపట్ల దురుసుగా ప్రవరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఆసుపత్రి ఆవరణ అంతా చెత్తచెదారంతో అపరిశుభ్రంగా ఉందన్నారు. దీంతో సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటానని స్పీకర్‌కు కలెక్టర్ తెలిపారు. ఆస్పత్రిని తాను తనిఖీ చేస్తానన్నారు. డ్యూటీ టైంలో వైద్యులు లేకుంటే ప్రజలకు భరోసా ఎలా కలుగుతుందని స్పీకర్ అన్నారు. రోగుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తించొద్దన్నారు. సేవాభావాన్ని అలవర్చుకోవాలని హితవు చెప్పారు. వెంటనే పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. స్పీకర్ వెంట ఎంపీటీసీ స్వప్నసురేశ్, కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సురేశ్, ధరమ్‌సింగ్, రాచన్న ఉన్నారు.



వైద్య సిబ్బంది పనితీరుపై ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఒక్కో పోస్టుకు పదులు, వందల సంఖ్యలో పోటీ పడుతున్నారు. 359 పోస్టులకు 12,856 మంది దరఖాస్తు చేశారు. ప్రభుత్వం నామమాత్ర పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా పోటీ మాత్రం వేలల్లో ఉంది. తమ పార్టీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ ద్వారా భారీగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేస్తామన్న కాంగ్రెస్ పాలకులు మాట తప్పారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అన్ని కేటగిరీల్లో 736 పోస్టులు ఖాళీలుంటే అందులో సగం పోస్టులకైనా నోటిఫికేషన్ ఇవ్వక పోవడంతో తీవ్ర పోటీ నెలకొందని ఉద్యోగార్థులు వాపోతున్నారు.



- ఎక్కువ దరఖాస్తులొచ్చిన జిల్లాల్లో రాష్ట్రంలో ఐదో స్థానంలో వికారాబాద్
- ఒక్క మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు 119 మంది.. తెలుగు పోస్టుకు 111 మంది నిరుద్యోగుల పోటీ
- సోషల్ ఎస్ఏ పోస్టుకు 93 మంది దరఖాస్తు
- స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో పోటీ తక్కువ
- ఒక్కో ఎస్ఏ పోస్టుకు 9 మంది.. ఎస్జీటీ పోస్టుకు ముగ్గురు చొప్పున కాంపిటీషన్


టీచర్ పోస్టులకు తీవ్ర పోటీ

జిల్లాలో అరకొరగా ఉపాధ్యాయ పోస్టులు.. వేలల్లో దరఖాస్తులు

736 ఖాళీలు ఉంటే.. 359 పోస్టులకు నోటిఫికేషన్

జిల్లాలో అన్ని కేటగిరీల్లో 736 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే పాఠశాల విద్యా శాఖ 359 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలో 1,063 ప్రభుత్వ, పరిషత్తు పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 776, ప్రాథమికోన్నత పాఠశాలలు 111, ఉన్నత పాఠశాలలు 176 ఉన్నాయి. ఈ పాఠశాలలకు 4,648 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు కాగా 3,912 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అన్ని కేటగిరిలకు సంబంధించి ఇప్పటికే 736 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, పదోన్నతులతో జిల్లాలో మరో 400 వరకు వివిధ కేటగిరీల్లో టీచర్ పోస్టుల ఖాళీ లేర్పడే అవకాశం ఉంది. పదోన్నతులతో ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువ శాతం ఖాళీలు ఏర్పడనున్నాయి. షెడ్యూల్ ప్రకారం డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తయ్యే వరకు మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. అంత వరకు ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధన ఎలా ముందుకు సాగుతుందనేది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. కొత్త ఉపాధ్యాయులు నియామకమయ్యే వరకు విద్యా వలంటీర్లతో విద్యా బోధన కొనసాగిస్తారా? లేక గతేడాది మాదిరిగానే ఉపాధ్యాయుల సర్దుబాటుతో కాలం వెళ్లదీస్తారా? అనేది తేలాల్సి ఉంది.

వికారాబాద్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు తీవ్ర పోటీ నెలకొంది. ఉపాధ్యాయ ఖాళీలు తక్కువుండడంతో దరఖాస్తులు తక్కువగానే వస్తాయని భావించినా నిరుద్యోగుల నుంచి భారీగా దరఖాస్తులొచ్చాయి. ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతకు ముందు టెట్ అర్హత సాధించని అభ్యర్థులతో పాటు గత ఏడాది బీఎడ్, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించింది. టెట్‌లో అభ్యర్థుల ఉత్తీర్ణతా శాతం గతంలో కంటే ఈ సారి ఎక్కువగా ఉండడంతో డీఎస్సీకి పోటీ పడే అభ్యర్థుల సంఖ్య పెరిగింది. దీన్ని బట్టి జిల్లాలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. గత ఏడాది జిల్లాలో 191 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 9,772 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ సారి 359 పోస్టులకు 12,856మంది దరఖాస్తు చేశారు. ఉపాధ్యాయ పోస్టుల దరఖాస్తుల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచింది. 169 తెలుగు మీడియం ఎస్జీటీ పోస్టులకు 4,680 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్జీటీ ఉర్దూ మీడియం పోస్టులు 26 ఉండగా, 221 మంది పోటీ పడుతున్నారు. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం పోస్టులు 28 ఉండగా, 89 మంది అప్లై చేశారు. తెలుగు మీడియం స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 21 బయాలజికల్ సైన్స్ సబ్జెక్ట్ పోస్టులకు 1,299 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోషల్ స్టడీస్‌లో 23 పోస్టులకు 2,150 మంది పోటీ పడుతుండగా, మ్యాథమెటిక్స్‌లో 9 పోస్టులకు 1,070 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఫిజికల్ సైన్స్‌లో 4 పోస్టులకు 311 మంది పోటీ పడుతున్నారు. ఉర్దూ మీడియం స్కూల్ అసిస్టెంట్ మ్యాస్‌లో 3 పోస్టులకు 26 మంది దరఖాస్తు చేశారు. ఫిజికల్ సైన్స్‌లో 2 పోస్టులకు 11 మంది పోటీ పడుతుండగా, సోషల్ స్టడీస్‌లో 2 పోస్టులకు 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఆరు ఉండగా, 50 మంది పోటీ పడుతున్నారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 23 పోస్టులకు 591 మంది దరఖాస్తు చేసుకోగా, 3 హిందీ పోస్టులకు 129 మంది పోటీ పడుతున్నారు. తెలుగు పోస్టులు ఏడు ఉంటే, 777 మంది దరఖాస్తు చేశారు. ఉర్దూ పోస్టులు రెండు ఉండగా 53 మంది పోటీ పడుతున్నారు. లాంగ్వేజ్ పండితుల విభాగంలోనూ పోటీ తీవ్రంగానే ఉంది. ఎల్పీ హిందీ పోస్టులు 11 ఉండగా 168మంది దరఖాస్తు చేసుకున్నారు. తెలుగు పోస్టులు 8 ఉంటే 643 మంది పోటీ పడుతుండగా, 3 ఉర్దూ పోస్టులకు 18 మంది, ఒక సంస్కృతం పోస్టుకు ఆరుగురు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. పీఈటీ తెలుగు మీడియం పోస్టులు ఐదు ఉంటే 349 మంది పోటీ పడుతున్నారు.



మెగా డీఎస్సీ పెట్టాలని డిమాండ్

తాము అధికారంలోకి వస్తే 20వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత 11,062 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడంతో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో 20వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని ప్రకటించి 11వేల పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేసి నిరుద్యోగ అభ్యర్థుల ఆశలు గల్లంతు చేసిందంటూ నిరుద్యోగులు నిరసనలు వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా పోస్టులు పెంచాలని ఒత్తిడి చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. పోస్టులు ఎక్కువుంటే.. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నా తమకు అవకాశం వస్తుందనే ఆశ ఉండేదని, ఇప్పుడు నెలకొన్న తీవ్ర పోటీతో టీచర్ ఉద్యోగం సాధించడం కష్టతరంగా మారిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఏ మ్యాథమెటిక్స్‌కు భారీగా అభ్యర్థులు

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ తెలుగు మీడియం పోస్టుకు తీవ్ర పోటీ నెలకొంది. ఒక్కో పోస్టుకు 119 మంది చొప్పున పోటీ పడుతున్నారు. ఆ తరువాత తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు పోటీ ఉంది. ఒక్కో పోస్టుకు 111 మంది పోటీ పడుతున్నారు. ఎస్ఏ సోషల్ పోస్టుకు 93 మంది పోటీ పడుతుండగా, బయోసైన్స్‌కు 62 మంది పోటీ పడుతున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం పోస్టుకు 8 నుంచి 9 మంది వరకు పోటీ పడుతున్నారు. ఒక్కో ఎస్జీటీ తెలుగు మీడియం పోస్టుకు 28 మంది పోటీ పడుతుండగా, ఒక్కో ఉర్దూ మీడియం ఎస్జీటీ పోస్టుకు 9మంది పోటీ పడుతున్నారు. తెలుగు మీడియం పీఈటీ పోస్టుకు 70మంది పోటీ పడుతుండగా, ఎల్పీ తెలుగు పోస్టుకు 80 మంది పోటీ పడుతున్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ తెలుగు మీడియం పోస్టుకు మాత్రం పోటీ తక్కువగానే ఉంది. ఒక్కో పోస్టుకు 4 గురు పోటీ పడుతున్నారు.

వర్షాల కోసం వరద పాయసం

- పూజలు చేసిన ద్యాచారం గ్రామస్తులు

వికారాబాద్, జూన్ 24 : మొన్నటి వరకు కురిసిన వర్షాలు విత్తనాలు విత్తాక ముఖం చాటేయడంతో రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. వానదేవుడి కరుణ కోసం రకరకాల పూజలు చేస్తున్నారు. సోమవారం వికారాబాద్ మండలం ద్యాచారం గ్రామస్తులు వీరభద్రస్వామికి పూజలు నిర్వహించారు. వరద పాయసం చేశారు. వర్షాలు పడాలని గ్రామస్తులు దేవుళ్లను వేడుకున్నారు.



రాతిపై వరద పాయసం పోస్తున్న ద్యాచారం వాసులు

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బదిలీ



మేడ్చల్ జూన్ 24(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య(ఐఏఎస్) సోమవారం బదిలీ అయ్యారు. ఆయనను ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్లు ఆయన మేడ్చల్ జిల్లాలో విధులు నిర్వహించారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుంది!



కొడంగల్ రూరల్, జూన్ 24: ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న ఆహారాన్ని ఓ పంది తినబోగా దాని తల కవర్లో ఇరుక్కుపోయింది. దీంతో కవర్‌ను వదిలించుకోలేక పంది నరకయాతన పడింది. కొడంగల్‌లో సోమవారం ప్లాస్టిక్ కవర్‌లో ఉన్న ఆహారాన్ని తినబోయిన పంది తల కవర్లో ఇరుక్కుపోవడంతో పట్టణంలో అటూ ఇటూ తిరుగుతూ కనిపించింది. కొందరు దాని తల నుంచి కవర్‌ను తొలగించాలని చూసినా మనుషులకు దొరక్కుండా పంది పరుగెత్తింది. చివరకు ప్రధాన రోడ్డు నుంచి వెళ్లిపోయింది.



ఘనంగా బొడ్రాయి పండుగ

ఘట్‌కేసర్, జూన్24: పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడలో సోమవారం బొడ్రాయి పండుగను నిర్వహించారు. బొడ్రాయిని ప్రతిష్ఠించి మూడేళ్లు అవుతున్నందున పూజలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. స్వామి వారికి గావు, బలిగంపతో ఊరేగింపు, చంద్రపటం, జలాబిషేక పూజలు నిర్వహించారు. బైండ్ల పూజారులను సన్మానించారు. మున్సిపల్ ఛైర్మన్ బి.కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కుల సంఘాల పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ జూన్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి ప్రజావాణిలో వివిధ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 121 ఫిర్యాదులు అందినట్లు అధికారలు తెలిపారు. డీఆర్వో హరిప్రియ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

వికారాబాద్: ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. కల్లెక్టరేట్ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు 250వరకు ఫిర్యాదులు అందజేశారు. ధరణికి సంబంధించిన భూ సమస్యలపై, పింఛన్లు, ఇరిగేషన్, వికలాంగులశాఖ, జిల్లా పంచాయతీ, ఇతర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూముల విలువ పెంపునకు

కసరత్తు పూర్తి

మేడ్చల్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్ విలువను అనుసరించి భూముల ధరలను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి కొత్తధరలు అమలు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఆదాయం వచ్చేలా, కొనుగోలుదారులకు ఆర్థికభారం కాకుండా ఉండేలా కసరత్తు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రతీ ఆగస్టులో సర్దుబాటు చేస్తూ భూముల ధరలను పెంచడం సాధారణమే అయినా ఈ ధరల్ని వాస్తవ డిమాండ్‌లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ప్రస్తుతమున్న భూముల విలువపై 7.5శాతం పన్ను విధిస్తూ ఆదాయం పొందనుంది. ప్రతీ రిజిస్ట్రేషన్‌పై వినియోగచార్జీలు, గ్రీన్‌ట్యాక్స్ పేరున అదనంగా రూ.వెయ్యి చార్జి చేస్తున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పూర్తిగా నగరశివారులో విస్తరించి ఉండటంతో రియల్ వ్యాపారం ఎప్పుడూ ఊపు మీదే ఉంటుంది. ఈ కారణంగా భూముల ధరలు ఒక్కసారిగా పెంచేశారు. వీటి విలువల ఆధారంగా జిల్లా, డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో వాస్తవ డిమాండ్ ఆధారంగా ధరల సర్దుబాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మార్కెట్‌లో కొనసాగుతున్న వాస్తవ ధరలకు, సర్కారు వ్యాల్యూకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సవరణపై నివేదికను సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వం 2021, 2022 సంవత్సరాల్లో వ్యవసాయ భూముల మార్కెట్ విలువను గణనీయంగానే పెంచింది. తక్కువ ధరలున్న చోట 50శాతం, మధ్యస్తంగా ఉంటే 40శాతం, ఎక్కువ ఉంటే 30శాతం వరకు పెంచారు. ఈ సారి అలా కాకుండా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో భూమి మార్కెట్ విలువ ఎంత ఉంది? రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎంత ఉంది అన్నది తెలుసుకొని ఈ రెండింటి వ్యత్యాసాన్ని తగ్గించేలా హేతుబద్ధీకరిస్తారు. భూముల మార్కెట్ ధరలు క్రమక్రమంగా పెంచేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో డిమాండ్ ఇలా..

జిల్లాలో మండలాలు, మున్సిపాల్టీలు, హెచ్ఎండీఏ పరిధిలో ఒక్కో చోట డిమాండ్ ఉన్నట్లు అధికారులు ఇప్పటికే గుర్తించారు. సాధారణ ధరలు రూ. 2,100 నుంచి రూ.30వేల వరకు ఉన్నాయి. ఓఆర్ఆర్ చుట్టూ రూ.2,200 ఉండగా డిమాండ్ రూ.40వేల నుంచి రూ.50వేలు వరకు ఉంది. జిల్లాలోని హైవేల వెంబడి రూ.15వేలు ఉండగా డిమాండ్ లక్షల్లో ఉంది. వ్యవసాయ భూములు రూ.15లక్షలు ఉండగా డిమాండ్ కోట్లల్లో ఉంది.



అధ్యయనం పూర్తి

భూముల విలువ పెంపుపై సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్లతో కూడిన సమన్వయ కమిటీ అధ్యయనం రెండు రోజుల క్రితమే పూర్తికాగా, ఆదివారం రాష్ట్ర కమిషనరేట్‌కు పంపారు. జిల్లా, మండల, మున్సిపల్ కేంద్రాల్లో డిమాండ్ ఉన్న సర్వే నంబర్లు ఏవి? ఏ ప్రాంతాల్లో ఎంత విలువ పెరుగుతుంది? ఈ నివేదికలను జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా ఉన్న కమిటీ ఈ నెల 29న మార్పులు చేర్పులను పరిశీలిస్తారు. తుది నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పిస్తారు. జిల్లాలో వచ్చిన ప్రతిపాదనలను భూ యాజమాన్య హక్కుదారులకు తెలిపేలా ఈ నెలాఖారులోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి హక్కుదారుల అభ్యంతరాలను పరిశీలిస్తారు. అనంతరం వాస్తవ రూపంలోకి ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలు చేయనున్నారు.

తేడాను గుర్తించాం

జిల్లాలో సాధారణ, డిమాండ్ ధరల తేడాలను గుర్తించాం. మండలాల వారీగా నివేదికలను పూర్తిచేశాం. కలెక్టర్ ఛైర్మన్‌గా జరిగే సమావేశంలో తుది రూపం వచ్చాక ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అభ్యంతరాలను పరిశీలించాక వాటిని అమలు చేస్తారు. జిల్లా హెచ్ఎండీ పరిధిలో ఉండటంతో హెచ్ఎండీఏ అనుమతులు కూడా తీసుకోవాల్సి ఉంటుంది.

సంతోష్, జిల్లా రిజిస్ట్రార్, మేడ్చల్-మల్కాజిగిరి

ఫైల్స్ పెండింగ్ పెట్టొద్దు

- వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 24 : పోలీస్ సిబ్బందికి సంబంధించిన ఎలాంటి ఫైల్స్‌ను పెండింగ్‌లో పెట్టొద్దని, డీపీవో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం డీపీవో అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. మొదట డీపీవో సిబ్బందికి ఉన్న ఇబ్బందులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పే సెక్షన్, బడ్జెట్ సెక్షన్, ఎస్టాబ్లిష్ సెక్షన్ల అధికారులు, సిబ్బంది ఎలాంటి ఫైల్స్‌ను పెండింగ్‌లో పెట్టవద్దన్నారు. ఎప్పటి పని అప్పుడే పూర్తి చేయాలని సూచించారు. అలాగే లాంగ్ పెండింగ్ ఫైల్స్ ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, డీపీవో సూపరింటెండెంట్ అధికారులు, డీపీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

కళాశాల అదనపు గదుల తాళాలు వెంటనే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు

తాండూరు, జూన్ 24: తాండూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణం పూర్తై ప్రారంభించినా కాంట్రాక్టర్ బిల్లులు రాలేవనే సాకుతో అదనపు గదుల తాళం వేసుకోని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఎస్ఎఫ్ఐ, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ అధికారులు కాంట్రాక్టర్ నుంచి అదనపు గదుల తాళాలు ఇప్పించి, విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బుగ్గప్ప, ఎస్ఎఫ్ఐ తాండూరు డివిజన్ నాయకులు దీపక్, కల్యాణ్, సురేష్, ఎమ్మార్పీఎస్ మాజీ నాయకులు బలరాం, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు పాఠశాలల బంద్



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

వికారాబాద్, జూన్ 24: ఈనెల 26న(రేపు) పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ వికారాబాద్ నాయకులు తెలిపారు. వికారాబాద్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తూ అనుమతిలేని పుస్తకాలు అమ్ముకుంటూ విద్యను వ్యాపారంగా మలిచారని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హరీష్ రావు, టౌన్ సెక్రటరీ మహేష్, జాయింట్ సెక్రటరీ జగదీష్, అనిల్, రాజేందర్, కౌశిక్, నవీన్, సునీల్ పాల్గొన్నారు.

ఎన్‌టీటీతో మల్లారెడ్డి యూనివర్సిటీ ఒప్పందం



ఎన్‌టీటీ డేటా సంస్థ ప్రతినిధులకు ఒప్పంద పత్రాలను సమర్పిస్తున్న మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, జూన్ 24: సేల్స్ ఫోర్స్ సాంకేతికపై తమ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించడానికి ఎన్‌టీటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీలో సోమవారం ఎన్‌టీటీ సంస్థతో మల్లారెడ్డి యూనివర్సిటీ వారు ప్రత్యేకంగా ఒప్పందం చేసుకున్నారు. ఈసందర్భంగా ఇరువురు ఒప్పందపత్రాలను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కులపతి ఎస్.కే.రెడ్డి, డీన్ రవీంద్రులు, ఎన్‌టీటీ డేటా సంస్థ ఉన్నత అధికారులు డాక్టర్ తయ్యబా, డాక్టర్ మీరావలి, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అదేతీరు..!

» సప్లిమెంటరీలోనూ సత్తాచాటిన అమ్మాయిలు » ఫస్టియర్‌లో 52.44శాతం.. సెకెండియర్‌లో 31.88శాతం



వికారాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో ఆశించిన స్థాయిలో మెరుగైన ఫలితాలు రాకపోవడం గమనార్హం. ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఫస్టియర్‌లో 52.44శాతం, సెకెండియర్‌లో 31.88శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్ విభాగంలో 4016మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 2068మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలకు బాలురు 2073మంది జరు కాగా, వారిలో 899మంది ఉత్తీర్ణత సాధించి 43.37 శాతం నమోదైంది. బాలికలు 1943 మంది హాజరవగా వారిలో 1169 మంది ఉత్తీర్ణులై 60.16శాతం నమోదు చేసుకున్నారు. అదే ఒకేషనల్ విభాగంలో 610మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 358 ఉత్తీర్ణత సాధించి 58.69శాతం నమోదు చేసుకున్నారు. పరీక్షలకు 298మంది బాలురు హాజరు కాగా, వారిలో 132మంది ఉత్తీర్ణత సాధించి 44.3శాతం నమోదు చేసుకోగా, బాలికలు 312మంది హాజరయ్యారు. వారిలో 226మంది ఉత్తీర్ణులై 72.44శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు. సెకెండియర్ పరీక్షల్లో జనరల్ విభాగంలో 2829మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 837మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 29.59శాతం నమోదు చేసుకున్నారు. పరీక్షలకు 1640మంది బాలురు హాజరవగా, వారిలో 452మంది ఉత్తీర్ణత సాధించి 27.56శాతం నమోదు చేసుకున్నారు. బాలికలు 1189మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 385మంది ఉత్తీర్ణులై 32.38శాతం నమోదు చేసుకున్నారు. ఒకేషనల్ విభాగంలో 386 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 188 మంది ఉత్తీర్ణత సాధించి 48.7 శాతం నమోదు చేసుకున్నారు. బాలురు 251 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 113మంది ఉత్తీర్ణులై 45.02 శాతం నమోదు చేసుకున్నారు. బాలికలు 135 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 75మంది ఉత్తీర్ణులై 55.56శాతం నమోదు చేసుకున్నారు.

కనుల పండువగా రామలింగేశ్వర స్వామి పల్లకీసేవ



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఆలయ చైర్మన్, ఈవో, భక్తులు

కీసర, జూన్ 24: కీసరగుట్టలో శ్రీ రామలింగేశ్వరస్వామి వారి పల్లకీసేవ కనుల పండువగా జరిగింది. స్వామివారి నిత్య సేవలో భాగంగా సోమవారం ఉదయం గర్భాలయంలో మూలవిరాట్‌కు శ్రీమహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ ఆధ్వర్యంలో ఈవో సుధాకర్ పర్యవేక్షణలో భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. శివనామస్మరణతో కీసరగుట్ట మారుమోగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా

వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

మేడ్చల్, జూన్ 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ శుక్రవారం తప్పకుండా ఇంటింటికీ వెళ్లి జ్వర సంబంధమైన కేసులను ముందుగానే గుర్తించడం, ఫాగింగ్ కార్యకలాపాలు, వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి సానుకూల కేసులు గుర్తించాలన్నారు.

కాల్వల మరమ్మతుకు అంచనాలు తయారు చేయాలి

» నీటిపారుదలశాఖ ఎస్ఈకి స్పీకర్ ఆదేశం

ధారూరు, జూన్ 24: లక్నాపూర్ ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ కాల్వలను పరిశీలించి మరమ్మతుకు అంచనాలు తయారు చేయాలని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ సోమవారం నీటిపారుదలశాఖ చేవెళ్ల సర్కిల్ ఎస్ఈకి ఉత్తర్వులు జారీచేశారు. లక్నాపూర్ ప్రాజెక్టు పరిధిలోని మోమిన్‌కలాన్, రాజాపూర్, మోమిన్‌కుర్దు, నాగారం, అంతారం గ్రామాల ఆయకట్టుకు నీరందించే తొమ్మిది కిలోమీటర్ల కుడి కాల్వ, 12కిలోమీటర్ల ఎడమ కాల్వ ఉన్నాయని ఆయకట్టుదారులు స్పీకర్ దృష్టికి తెచ్చారు. కాగా ఈ కాల్వల్లో పూడిక మట్టి పేరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగి ఆయకట్టుకు నీరందటం లేదని, వీటిని మరమ్మతు చేయించాలని వారు కోరారు. ఆయకట్టుదారుల వినతి మేరకు ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ కాలువలను పరిశీలించి కాలువల మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని నీటిపారుదల శాఖ చేవెళ్ల సర్కిల్ ఎస్ఈని ఆయన ఆదేశించారు.



ఆర్టీసీ డీఎం సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

మాచన్‌పల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

షాబాద్, జూన్ 24 : షాద్‌నగర్ నుంచి వయా మాచన్‌పల్లి చేవెళ్ల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని మాచన్‌పల్లి గ్రామస్థులు సోమవారం షాద్‌నగర్ డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రతీరోజు విద్యార్థులు, గ్రామస్థులు వివిధ పనుల నిమిత్తం చేవెళ్లకు వెళుతుంటారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి సహకరించాలన్నారు. మాజీ సర్పంచ్ సత్తయ్య, గ్రామస్థులు కూతురు మహేందర్, హరికృష్ణ, నవీన్, స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న యువ నాయకుడు శివచారి

పాటు కాలువను పరిరక్షించండి

కొత్తూర్, జూన్ 24: మున్సిపాలిటీలోని జేపీ దర్గా రోడ్డులో గణపతి కాలనీకి ఆనుకొని ఉన్న పాటు కాలువ అక్రమణకు గురైందని, దాన్ని పరిరక్షించాలని కోరుతూ స్థానిక బీఆర్ఎస్ యువనాయకుడు కె.శివచారి కొత్తూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వచ్చిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీలకు వినతి పత్రాలను అందజేశారు. కొత్తూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు గణపతి కాలనీని ఏర్పాటు చేశారని, మురుగునీటి కాలువలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఇదిలా ఉండగా, కాలనీకి పక్కనే ఉన్న కాశనకుంట పాటు కాలువ కబ్జాకు గురికావడంతో వర్షకాలంలో నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోందని, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రవి, రంజిత్, సాగర్, అనిల్ తదితరులు వినతిపత్రాలు అందజేసిన వారిలో ఉన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



మహేశ్వరం, జూన్ 24 : 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన సంఘటన మహేశ్వరంలో చోటు చేసుకుంది. సోమవారం మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కోసం వెళ్లింది. ఆసుపత్రి సిబ్బంది ప్రథమ చికిత్స చేసి డెలివరీ నిమిత్తం 108 వాహనంలో హైదరాబాదుకు తరలించేందుకు నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో గర్భిణీకి పురిటినొప్పులు ఎక్కువవ్వడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది నార్మల్ డెలివరీ చేశారు. మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అంబులెన్స్ సిబ్బంది సురేందర్, యాదయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మూలనపడిన 'ఓపెన్ జిమ్'

పరికరాలను ఎత్తుకెళ్లిన దొంగలు

» పట్టించుకోని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం
» వ్యాయామానికి దూరమవుతున్న పట్టణ వాసులు
» రెండేళ్లుగా పట్టించుకోని వైనం
» ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



తాండూరు ఆదర్శనగర్ ఓపెన్ జిమ్‌లో పాడైన పరికరాలు



మరమ్మతుకు నోచుకోని విలువైన పరికరాలు

తాండూరు, జూన్ 24: వేగవంతమైన జీవన విధానంలో విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు రకరకాల ఒత్తిళ్లతో సతమతమవుతున్నారు. ఖాళీ లేకుండా గడిపే సగటు పట్టణవాసికి ఆహ్లాదం పంచడంతో పాటు, శరీరదారుడ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఓపెన్‌జిమ్ (బహిరంగ వ్యాయమశాల)లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర పురపాలకశాఖ ఆధ్వర్యంలో టీఎండీసీ (తెలంగాణ మున్సిపాలిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు) ప్రపంచ బ్యాంకు నిధులు రూ.15లక్షల వ్యయంతో తాండూరు పట్టణం ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేశారు. కానీ తాండూరు మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. రెండేళ్లుగా ఓపెన్ జిమ్‌ను 'క్లీన్ తెలంగాణ - పట్టణ గ్రీన్ తెలంగాణ' పేరిట చేపట్టారు. మొదట్లో ప్రజలు ఈ జిమ్‌లో వ్యాయమం చేసుకుని సంతోషించేవారు. రాను రాను నిర్వహణ లేక ప్రజలకు జిమ్‌కు దూరమైంది. జిమ్‌లో ఏర్పాటు చేసిన ఏరో వాల్కర్, చెస్ట్ ప్రెస్ డబుల్, సర్ఫబోర్డు, బిగ్‌ఆర్మీ వీల్, డ్యుయెల్, లెగ్‌ప్రెస్, ట్విస్టర్, పుల్‌చైర్, స్టాండింగ్, రోయింగ్‌మిషన్, డబుల్ ఆర్మీ స్ట్రెంటర్, ఎలిపిటిక్ మిషన్, లెగ్ ఎక్స్టెన్సర్, స్పిన్నర్ వీల్, సిట్టింగ్ ట్విస్టర్ వంటి వ్యాయామ పరికరాలు మూలనపడ్డాయి. రెండేళ్లుగా మరమ్మతులు చేయించడం లేదు. మరికొన్ని పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో నిర్వహణ బాధ్యతను అప్పట్లో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించగా వారు నిర్వహణ కొనసాగించడంలేదు. జిమ్‌లో ఏర్పాటు చేసిన 13రకాల పరికరాలు విరిగిపోయిన, తుప్పుపట్టిన పరికరాలు దర్శనమిస్తున్నాయి.

అధికారుల పట్టింపు కరువు

ఓపెన్ జిమ్ విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిర్వహణ బాధ్యతలు పక్కనపెడితే లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ విషయమై ఉన్నతాధికారులకు లేఖ రాసిన పాపానపోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లలో ముగ్గురు కమిషనర్లు మారినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదంటున్నారు. కనీసం ప్రస్తుత కమిషనర్ అయినా పట్టించుకుని ఓపెన్ జిమ్‌లో పరికరాలను మరమ్మతు చేయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

'ఎమ్మెల్యేగారూ.. చొరవ తీసుకోండి'

తాండూరు ఓపెన్ జిమ్‌ను పునరుద్ధరించడంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మూలనపడిన ఓపెన్ జిమ్‌ను వినియోగంలోకి తీసుకొస్తే చిన్నారులు, యువకులు, క్రీడాకారులకు, వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి పరికరాలను మరమ్మతు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



విలేకరు సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి శ్రీనివాస్

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకమవ్వాలి

షాబాద్, జూన్ 24 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకమవ్వాలని రాజేంద్రనగర్ డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలంలో చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో పరిసరాల్లో పరిశ్రమలు ఉండడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నందున్నారని తెలిపారు. ఆ కారణం చేత నేరాలు ఎక్కువగా చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మండలంలో ఎవరికైన జఠిలమైన సమస్యలు ఉంటే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్‌నెంబర్ 8712663029లో సంప్రదించి సమస్యలు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సైలు నవీన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ పొలాలకు రోడ్ల నిర్మాణం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఆమనగల్లు, జూన్ 24: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఆమనగల్లు, సంకటోనిపల్లి, మంగళపల్లి, చంద్రాయన్‌బోడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు సోమవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. సంకటోనిపల్లి రహదారి నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే ఆమనగల్లు సురసముద్రం చెరువు బ్యాక్ వాటర్ కాల్వపై వంతెన నిర్మించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు తల్లోజు రామకృష్ణ, తాళ్ల రవీందర్ ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనేక మంది రైతుల పొలాలు కాల్వ పైభాగంలో ఉన్నాయని.. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. కాల్వపై వంతెన నిర్మిస్తే నాలుగు గ్రామాలకు చెందిన అనేక మంది రైతులకు మేలు కలుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా రోడ్డులోని వాగు కాల్వపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులు గజ్జె జంగయ్య, తట్టిపల్లి నర్సింహ, వెంకటేశ్, గన్నోజు బాలయ్య, తాళ్ల రఘు, సత్యనారాయణ, బొల్లు శ్రీను, ఎంగిళి రఘు, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శోభారాణి

పిల్లల సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : సీడీపీవో

చేవెళ్ల, జూన్ 24 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సమగ్రాభివృద్ధిపై మరింత బాధ్యతగా శ్రద్ధ వహించాలని చేవెళ్ల సీడీపీవో శోభారాణి తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్ల శిక్షణలో భాగంగా సీడీపీవో పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో 10 సెక్టార్లలో ఉన్న 35 మంది అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత, పిల్లల అభివృద్ధి, పెరుగుదల సమగ్రామభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల అభివృద్ధి కోసం నూతన పద్ధతులను అమలు చేస్తుందన్నారు. పిల్లలకు ఆటపాటలు, సంభాషణ, కథ, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ట్రైనింగ్ మాస్టర్ భారతిరత్నం, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సునిత, కవిత, నాగమణి, రమాదేవి, శకుంతల, అనురాధ, సృజనవాణి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

యాచారం, జూన్ 24 : మండల కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థులు పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు లేకుండా పాఠశాల నడపరాదని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్నా.. అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విప్లవ్‌కుమార్, రాకేష్, నిఖిల్, శివ, తరంగ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

బీజేవైఎం నాయకులపై దాడి హేయం

కేశంపేట, జూన్ 24: నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం టీజీపీఎస్సీ వద్ద ఆందోళన చేసిన నాయకులను పోలీసులు విక్షణ రహితంగా కొట్టడం హేయమైన చర్య అని, పోలీసుల తీరును నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం కేశంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకపోవడానికి శాంతియుత నిరసన చేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో బీజేవైఎం కార్యాకర్తలను విచక్షణ రహితంగా కొట్టారని బీజేవైఎం అధికార ప్రతినిధి శివాజీ తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తుంటే.. ప్రభుత్వం పరిష్కరించుకుండా దాడులకు తెగబడడం సమంజసం కాదన్నారు. విగ్నేష్, సురేష్, హరికృష్ణ, శ్రీకాంత్, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.





మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

317 జీవో అమలులో అవకతవకలపై విచారణ జరిపించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : జీవో 317 అమలులో జరిగిన అవకతవకలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సేవ్‌కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రంగారెడ్డి జిల్లాలో 317 జీవో అమలు ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి జిల్లాకు అక్రమంగా వచ్చిన వారిని ఆయా జిల్లాలకు తిరిగి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ కోర్ కమిటీ సభ్యులు పొనగంటి మహిపాల్ రెడ్డి, బి.మధుకర్‌రెడ్డి, తలారీ సురేష్, జయశీల, జగదీశ్వర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సునీత, మాధురి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు



తినుబండారాలను తయారు చేస్తున్న మహిళలు



రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్

మేడ్చల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారితో క్యాంటీన్లు పెట్టించాలని భావిస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం విధించారు. జిల్లాలో 3,390 స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులో 36,782 మంది సభ్యులున్నారు. సంఘాల అర్హతను బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ ఇస్తారు. దీంతో పాటు ప్రభుత్వపరంగా క్యాంటీన్లు ఏర్పాటుచేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు కేటాయించాలని సర్కారు ఇటీవలే నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో మంత్రి సీతక్క చేతులమీదుగా క్యాంటీన్‌ను ఇటీవల ప్రారంభించారు. జిల్లాలోనూ వీటిని నెలకొల్పితే మహిళలకు ఇవి దన్నుగా నిలువనున్నాయి.

కార్యాచరణ తయారీలో..

జిల్లాలో మహిళా కాంటీన్లను పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ గౌతమ్ ఇటీవల సమావేశం నిర్వహించి ఆదేశించారు. అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. మహిళలు, క్యాంటీన్లు నిర్వహించడంతో పాటు మీసేవా కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్ ఏర్పాటు చేసేందుకు మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమం పూర్తయింది. ఆయా యూనిట్లు నెలకొల్పేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

స్థలాల కోసం అన్వేషణ

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంఉండగా అందుకు అనువైన స్థలాలను ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉండే కలెక్టరేట్‌తో పాటు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్ మేడ్చల్ జిల్లాకు దక్కడంతో సెక్రెటేరియట్ భవనం జీప్లస్ 5వ అంతస్తులో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీనుకు ఊహించినదానికంటే ఎక్కువ స్పందన రావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే ఏర్పాటు చేస్తాం

మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో పలు చోట్ల నెలకొల్పేందుకు అనువైన స్థలాలు చూస్తున్నాం. అవి గుర్తించగానే అర్హులైన మహిళా సంఘాలన ఎంపిక చేసి నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. ఇతర యూనిట్లను సైతం నెలకొల్పి మహిళలను మరింత ఆర్థిక బలోపేతం చేస్తాం. - సాంబశివరావు, డీఆర్‌డీవో, మేడ్చల్ - మల్కాజిగిరి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థికి విద్యుత్ షాక్

షాద్‌నగర్, జూన్ 24 : మేధా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి విద్యుత్ షాక్ గురయ్యాడంటూ ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఈమేరకు సోమవారం పాఠశాల ఎదుట విద్యార్థి తల్లితండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మహేష్ మాట్లాడుతూ ఈనెల 22న మేధా పాఠశాల విద్యార్థికి పాఠశాల ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల సిబ్బందిని వివరణ కోరగా.. ఆ బాలుడు స్కూల్‌కు రావడానికి ఇష్టం లేక గోడ దూకి పారిపోయేందుకు యత్నిస్తున్న తరుణంలోనే విద్యుత్ షాక్‌కు గురయ్యాడని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తమ మీద ఎలాంటి అపవాదు రావద్దన్న ఉద్దేశంతోనే సిబ్బందితో పాటు, యాజమాన్యం కూడా అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఈ విషయంపై పాఠశాల సిబ్బంది, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, షాద్‌నగర్ పట్టణానికి చెందిన అర్మాన్ అనే 5వ తరగతి విద్యార్థి గత శనివారం ప్రమాదానికి గురయ్యాడు.

రైతు రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయం



యాలాల: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కోట్‌పల్లి: రేవంత్, సోనియా, రాహుల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



తాండూరు రూరల్: ఎల్మకన్నె సహకార సంఘం వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

యాలాల, జూన్ 24: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ అధ్యక్షుడు అక్బర్‌బాబా, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, గురాజ్ జోషి పాల్గొన్నారు.

పెద్దేముల్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీమేరకు కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం రైతులకు రూ 2లక్షలు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, మండల అధ్యక్షుడు గోపాల్, ఎంపీటీసీ శంకర్, నాయకులు గాజీపూర్ నారాయణరెడ్డి, సాయిని నారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, మైనార్టీ నాయకులు రియాజ్, డీవై.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం బషీరాబాద్‌లోని అంబేడ్కర్ చౌక్‌వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నాయకులు రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, నవాంద్గి పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, మాజీ వైస్‌ఎంపీపీ ఎస్.వెంకటేష్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శి జి.మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, నాయకులు పి.శంకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, బాస్పల్లి శ్రీనివాస్‌రెడ్డి, రామునాయక్, శ్రావణ్‌కుమార్, రాజవర్ధన్‌రెడ్డి, శంకరప్ప, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చిందని తాండూరు మండల ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం తాండూరు మండలం ఎల్మకన్నె సహకార సంఘం ఆవరణలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తంచంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, పీఏసీఎస్ రవీందర్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, పండరి, మల్లేశం, శామప్ప, ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, జర్నప్ప, రాజేందర్‌రెడ్డి, రాము, రాముయాదవ్, రాజుగౌడ్, శ్రీశైలంగౌడ్, విజయ్‌కుమార్, వెంకటేష్, రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుమారుడు అవినాశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు.

బంట్వారం(కోట్‌పల్లి): ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం హర్షణీయమని కోట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మల్‌రెడ్డి, సతీష్, మహేశ్వర్‌రెడ్డి, దినేష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట్, జూన్ 24: మండలంలోని రైతుల పట్టా భూములు ఒకరి భూమి మరొకరి పేరుపై నమోదు కావడంతో చాలా మంది రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దళిత ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. రైతులతో కలిసి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బొంరాస్‌పేట్ మండలంలోని చాలా మంది రైతులకు పట్టా పాసు పుస్తకాలు రాలేదని, ఒకరి భూమి మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదైందని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు స్పందించిన రెవెన్యూ అధికారులు వారం రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు చంద్రయ్య, లక్ష్మయ్య, వెంకటయ్య, రమేశ్, మోహన్, బాబు, రైతులు ఆలమ్మ, వెంకటమ్మ, కాశప్ప, నర్సిములు, ఎల్లయ్య, మొగులయ్య, దేవయ్య, బుజ్జమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

కొడంగల్ రూరల్, జూన్ 24: కొడంగల్‌లోని తాండూర్ రోడ్డులో గల షాదీఖానా శిథిలావస్థలో ఉందని, నూతన షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్కేగుల్షన్ డిమాండ్ చేశారు. కొడంగల్‌లో సోమవారం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. 12 సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉండటంతో పేద ముస్లింలో శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో షాదీఖానా నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సర్తాజ్‌హుసేన్, షేక్ రోమాన్, సయ్యద్ ముస్తాఫా, ఎండీ.పాషా, ఎండీ.ఆరీఫ్, ఎండీ.ఆబీద్, ఎండీ.ఖదీర్, ఎండీ.అమీర్ హుసేన్, ఎండీ.రషద్‌ఖాన్, ఎండీ.రవూఫ్, రమేశ్ నాయక్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రీ పాల్గొన్నారు.

రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో చేరికకు మండల స్థాయి ఎంపిక


శామీర్‌పేట, జూన్ 24: ఎంఈవో వసంతకుమారి ఆదేశాల మేరకు శామీర్‌పేటలోని మినీస్టేడియం గ్రౌండ్స్‌లో సోమవారం రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో చేరేందుకై శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల స్థాయి క్రీడాకారుల ఎంపికలను పీఈటీలు నిర్వహించారు. తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ఈ సారి అకాడమిక్ ఇయర్‌లో అడ్మిషన్ పొందేందుకై ఎంఈవో వసంత కుమారి ఆధ్వర్యంలో మండలంలోని పీఈటీలు సత్తిరెడ్డి, సునీల్, శ్వేత, గోపాల్‌చారి, రాధికరెడ్డి, వరలక్ష్మి, శ్రీనివాస్‌లు అర్హత గల విద్యార్థులకు పలు క్రీడల ఎంపికల పరీక్షలను నిర్వహించారు. మండలానికి చెందిన తొమ్మిది మంది, మూడుచింతలపల్లి మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్ర స్పోర్ట్స్‌స్కూల్‌లో చేరేందుకు మండల స్థాయి క్రీడల అర్హత పరీక్షల్లో ఎంపిక చేసినట్లు ఎంఈవో వెల్లడించారు.

నేడు తైబజార్ వేలం

మోమిన్‌పేట్, జూన్ 24: మోమిన్‌పేట్ తైబజార్ వేలం మంగళవారం(నేడు) నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆర్.నర్సింహులు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి గానూ ఇవాళ ఉదయం 11గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకాధికారి సమక్షంలో తైబజార్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు చెల్లించి తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వేలం దక్కించుకున్న వారు 50శాతం డబ్బులు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

దోమ: దోమ తైబజార్ 2024-25 సంవత్సరానికి మంగళవారం (నేడు)వేలం వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు ఇంటి పన్నులు చెల్లించి ఉండాలన్నారు. రూ.2వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, వేలంలో దక్కించుకున్న వారు మూడు రోజుల్లో 50 శాతం డిపాజిట్ చేయాలన్నారు.

రక్తహీనతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కులకచర్ల, జూన్ 24: చౌడాపూర్ మండలంలోని చాకల్‌పల్లిలో సోమవారం రక్తహీనత నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలమూర్ జిల్లా నవాబుపేట వైద్యాధికారి నరేశ్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అత్యంత సాధారణ రక్తాన్ని సికిల్ సెల్ అనీమియా అంటారని, రక్తపరీక్షల ద్వారా రక్తహీనత గుర్తించి వైద్యం అందించవచ్చునని తెలిపారు. గ్రామంలో ఇప్పటి వరకు మొత్తం 60మందికి రక్తపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా కామెర్లు ఉండి శరీరం పాలిపోయి, చేతులు, వేళ్ల వంపు తిరిగి ఉన్న వారిని గుర్తించి వైద్యం అందించినట్లు తెలిపారు. జులై 3వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాములు, అవినాష్, జగదీశ్, పంచాయతీ కార్యదర్శి నరేందర్, ఎంపీటీసీ రాములమ్మ, శేఖర్, మాజీ సర్పంచ్ చెన్నయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



చింతలపల్లి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, జూన్ 24: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చింతలపల్లి, మైసమ్మగడ్డతండా, గొంగుపల్లి తండాలకు బీటీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతపల్లి బీటీరోడ్డుకు ఎస్డీఎఫ్ నుంచి రూ.కోటీ 40లక్షలు కేటాయించగా గొంగుపల్లి, మైసమ్మగడ్డతండా రోడ్లకు ట్రైబల్ కింద రూ.కోటీ 40లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాలకు పది సంవత్సరాల నుంచి రోడ్డులేని దుస్థితి ఏర్పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అన్ని విధాలుగా గ్రామాలను అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, అజీమ్ పటేల్, శ్రీనివాస్‌గుప్తా, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏసీఆర్ భృంగి కళాశాల విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్



పి.కీర్తి (438/440)



డి.మౌనిక (463/470)

వికారాబాద్, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో వికారాబాద్‌లోని ఏసీఆర్ భృంగి కళాశాల విద్యార్థి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. కళాశాలకు చెందిన విద్యార్థిని పి.కీర్తి బైపీసీలో 438/440 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించినట్లు కళాశాల కార్యదర్శి ఏ.ప్రమీల చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి, శివప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, మహేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య, భూపాల్ వెంకటేష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ సురేశ్వర స్వామి తెలిపారు. ఎంపీసీలో డి.మౌనిక 463/470, జె.సుజాత 456/470, బైపీసీ నుంచి ఉమేజా మహీన్ 417/440, హెచ్ఈసీ నుంచి పి.శ్రీవిలాసిని 463/500, సీహెచ్.హారిక 427/500మార్కులు సాధించినట్లు తెలిపారు.

మెట్రో బస్సుల్లో దివ్యాంగుల బస్ పాసులను అనుమతించాలి

నవాబుపేట, జూన్ 24: మెట్రో బస్సుల్లో దివ్యాంగుల బస్ పాసులను అనుమతించాలని దివ్యాంగుల సమాఖ్య వికారాబాద్ జిల్లా నాయకుడు ఎండీ.జబ్బార్ అన్నారు.ఆయన నవాబుపేట మండల కేంద్రంలో విలేకరులతో సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఏ విధంగా అయితే బస్సు పాసులను అనుమతిస్తున్నారో అదేవిధంగా మెట్రో సర్వీసుల్లో అనుమతించాలన్నారు.

ఎస్బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయాలి

దోమ, జూన్ 24: దోమ మండల కేంద్రంలో మరో ఎస్బీఐ బ్రాంచీ ఏర్పాటు చేయాలని దోమ మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు కే.రాజిరెడ్డి కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 60వేలకు పైగా జనాభా ఉండగా 35వేల వరకు వివిధ ఖాతాలు ఉండటంతో ప్రస్తుతం ఉన్న ఎస్బీఐ బ్యాంకులో సేవలకు ఖాతాదారులు ఇబ్బంది పడాల్సివస్తోందని వాపోయారు. ఇప్పటికైనా మరో ఎస్బీఐ బ్రాంచ్ ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

దోమ, జూన్ 24: కులగణన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంఘం దోమ మండల అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్‌లు పెంచుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పలుమార్లు హామీ ఇచ్చినా తెలంగాణలో కాంగ్రెస్ పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



సాగునీరు విడుదల చేస్తున్న ఎంపీపీ ఎల్లూబాయి

శామీర్‌పేట, జూన్ 24: రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ ఎల్లూబాయి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధిలోని శామీర్‌పేట పెద్దచెరువు తూము నుంచి సోమవారం ముఖ్యఅతిథిగా పాల్గొని ఎంపీపీ ఎల్లూబాయి వర్షాకాలం రైతుల ఆయకట్టు పంటల సాగుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. శామీర్‌పేట పెద్దచెరువు పరిధి కింద వ్యవసాయ భూములున్న రైతులు వర్షాకాల సీజన్‌కు వరిపంటను సాగు చేసుకోవాలని పిలుపునిచ్చారు.కాళేశ్వరం ప్రాజెక్ట్, శామీర్‌పేట డివిజన్ డీఈఈ రవికాంత్ మాట్లాడుతూ.. శామీర్‌పేట పెద్ద చెరువు పరిధి కింద ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో 1100 ఏకరాల విస్తీర్ణంలో వరిపంటను రైతులు సాగు చేసుకునేలా నీటిని విడుదల చేసినట్లు వివరించారు. రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ శామీర్‌పేట డివిజన్ ఏఈ రాజీవ్‌కుమార్ సింగ్, ఎంపీటీసీ సాయిబాబ, రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ ఐలయ్యయాదవ్, డైరెక్టర్ భూమిరెడ్డి, కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తాండూరు రూరల్, జూన్ 24: మండలంలోని ఉద్దండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న శరత్ అనే విద్యార్థిని బోనోఫైడ్ విషయంలో కులంపేరుతో దూషించి అవమానపరిచిన ఉపాధ్యాయుడు రవీందర్‌కుమార్‌శర్మపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని జిల్లా సీఐటీయూ ప్రతినిధులు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి శరత్‌ను బోనోఫైడ్ విషయంలో అవమానపరుస్తూ అడ్మిషన్ తీసుకోకుండా అవమానకరంగా మాట్లాడి, విద్యార్థిని ఇబ్బందులకు గురిచేశారని వారిచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్సీ ఎస్టీ కమిషన్ హైదరాబాద్‌తోపాటు, జిల్లా ఎస్పీ, తాండూరు డీఎస్పీకి ఫిర్యాదు చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ హెచ్చరించారు. ఎస్ఐకి వినతిపత్రం ఇచ్చిన వారిలో ప్రజాసంఘాల నాయకులు నర్సింహులు, బలరాం, సురేష్, దీపక్, కల్యాణ్, శ్రీనివాస్, ఉద్దండా పూర్ మాజీ సర్పంచ్ శివరాజ్, వెంకట్‌రాం తదితరులున్నారు.

ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌కు శ్రీకారం

- పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ ఎంపిక

కొడంగల్, జూన్ 24: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలలను వేర్వేరు చోట్ల కాకుండా ఒకే దగ్గర ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి అధికారులతో సమీక్షించారు. కొడంగల్, మధిర నియోజకవర్గాల్లోని కొడంగల్, మధిరలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు.

సంక్షిప్తంగా..

● **బషీరాబాద్:** మండలానికి 60 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరైనట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ సోమవారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం (రేపు) ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తామని తెలిపారు.

● **శామీర్‌పేట:** శామీర్‌పేట రైతు సహకార సంఘం సభ్యుడు శామీర్‌పేట గ్రామానికి చెందిన దొంతరబోయిన నర్సింహ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా సోమవారం బాధిత కుటుంబానికి రైతు సంఘం నాయకులు పరామర్శించారు. రైతు సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఐలయ్యయాదవ్, డైరెక్టర్ భూమిరెడ్డిలు బాధిత కుటుంబానికి రూ.6వేల నగదును అందజేశారు.

● **ఘట్‌కేసర్:** విధాత ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గుజ్జా రమేష్ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయన సోమవారం మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు, విధాత ఫౌండేషన్ సభ్యులతోపాటు స్థానిక ఎస్ఐ శేఖర్‌తో కలిసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకటేష్, నాగుల్‌మీరా, బి.వెంకటేష్, అబ్దుల్ కయ్యూమ్ పాల్గొన్నారు.

● **కొడంగల్ రూరల్:** నర్సరీల్లోని మొక్కలపై శ్రద్ధ వహించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. రుద్రారం గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలో గ్రామస్థులు నాలుగు తీర్మానాలను ఆమోదించారు.

● **బొంరాస్‌పేట్:** బొంరాస్‌పేట్‌లో టీజీఎమ్స్ యాప్ ద్వారా ట్రాన్స్ కో అధికారులు పోల్ టు పోల్ సమస్యలను యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్‌తో కలిసి విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్థానిక సబ్‌స్టేషన్ నుంచి ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మొదటగా బొంరాస్‌పేట్‌లో సర్వే ప్రారంభించారు.

● **బొంరాస్‌పేట్:** మండలంలో కొనసాగిన ఉపాధిహామీ పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీని సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. రూ.6.94 కోట్ల పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.

● **పరిగి:** స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని పరిగి ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. సోమవారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇబ్రహింపూర్,దాడితండాలోని 1114 మంది విద్యార్థులకు బ్యాగులు, చెప్పులు పంపిణీ చేశారు.

● **పరిగి:** మండలంలోని రంగాపూర్ పాఠశాలలో అభివృద్ధి పనులను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. మండలంలోని రంగాపూర్‌లో అమ్మఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆయన పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

● **పరిగి:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని చిట్యాల్ పీహెచ్‌సీ, పరిగి మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలతో వచ్చే కొత్త నీరుతో అతిసార ప్రబలే ప్రమాదముందని తగు జాగ్రత్తలను వివరించారు. అతిసార వ్యాధి సోకిన వారికి ద్రవపదార్థాలు ఇవ్వాలన్నారు.

● **పూడూరు:** పూడూరు రైతు వేదికలో నేడు (మంగళవారం) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసిరాం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం(నేడు) ఉదయం 10గంటలకు జరిగే ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో రైతు భరోసా సలహా-సూచనలు, వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- హాస్టల్‌కు వెళ్లాలని తల్లిదండ్రుల మందలింపు
- మనస్థాపంతో రైల్వేబ్రిడ్జి నుంచి దూకిన బాలిక

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని రైల్వే వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పలకు చెందిన బాషపాక బుచ్చయ్య కుమార్తె నాగమణి(19) ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లో గల విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ అదే క్యాంపస్‌లోని గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది. ఆదివారం బయటకు వెళ్తున్నానని హాస్టల్ నిర్వాహకులకు చెప్పి వెళ్లింది. రాత్రయినా రాకపోవడంతో హాస్టల్ నిర్వాహకులు నాగమణికి ఫోన్ చేశారు. రాత్రికి మా ఫ్రెండ్ వాళ్ల ఇంట్లో ఉంటానని వారికి చెప్పింది. అదే రోజు తల్లిదండ్రులు నాగమణికి ఫోన్‌చేయగా హాస్టల్‌లో ఉన్నానని చెప్పింది. సోమవారం ఉదయం హాస్టల్‌కు రాకపోవడంతో నిర్వాహకులు ఆమె తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పారు. దీంతో తల్లిదండ్రులు నాగమణికి ఫోన్‌చేసి త్వరగా హాస్టల్‌కు వెళ్లమని మందలించారు. ఆందోళనకు గురైన బాలిక బైపాస్ రోడ్డులోని రైల్వే వంతెనపై నుంచి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు విద్యార్థినిని ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. బాలికను మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ.. స్టోన్ వ్యాపారి మృతి



మృతుడు వినోద్ కుమార్

యాలాల, జూన్ 24: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఓ స్టోన్ వ్యాపారి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం తాండూరు కొడంగల్ రోడ్డు మార్గంలో గల ఎస్వీఆర్ ఫంక్షన్‌హాల్ సమీపంలో జరిగింది. యాలాల పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు పట్టణంలోని గ్రీన్‌సిటీకి చెందిన వినోద్‌కుమార్(42), నాపరాతి వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వినోద్‌కుమార్ తాండూరు నుంచి కొడంగల్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర కొడంగల్ నుంచి తాండూరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వినోద్ కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో తాండూరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య నాగజ్యోతి, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడిపై అట్రాసిటీ కేసు

తాండూరు రూరల్, జూన్ 24: మండలంలోని ఉద్దండాపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌కుమార్ శర్మపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అదే గ్రామానికి చెందిన బుడగజంగం రాములు కుమారుడు బీజే.శరత్ బోనఫైడ్ విషయంలో కులంపేరుతో దూషించినట్లు విద్యార్థి తండ్రి బీజే.రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

తాండూరు రూరల్, జూన్ 24: వీరశెట్టిపల్లి కాగ్నా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు కరన్‌కోట్ ఎస్ఐ తెలిపారు. వీరశెట్టిపల్లి గ్రామానికి చెందిన జి.నర్సింహ్మయ్య, అదే గ్రామానికి చెందిన యాలాల నరేష్‌లు వేర్వేరు ట్రాక్టర్లలో సోమవారం తెల్లవారు జామున 4గంటలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ఈక్రమంలో గస్తీలో ఉన్న పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను సీజ్ చేసిన కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

యాలాల: కాగ్నా వాగులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు యాలాల పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం 9గంటలకు కాగ్నాలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి డ్రైవర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పూడ్చిన వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం

దౌల్తాబాద్, జూన్ 24: మండలంలోని బిచ్చాల్ గ్రామానికి చెందిన అశోక్ గౌడ్ (30) హైదరాబాద్‌లో కూలీ పనిచేసేవాడు. దివ్యాంగుడు కావడంతో పింఛన్ కోసం ప్రతీ నెల స్వగ్రామానికి వచ్చేవాడు. ఈక్రమంలో నెల రోజుల కిందట అనారోగ్యం కారణంగా సొంత గ్రామం బిచ్చాల్‌కు వచ్చాడు. ఈనెల 18వ తేదీన గ్రామానికి వచ్చిన అశోక్ రోజూ మాదిరిగా రాత్రి ఇంట్లో నిద్రించగా మృతిచెందాడు. సాధారణ మరణమని కుటుంబ సభ్యులు భావించినా అశోక్ అన్న నర్సింహులుకు అనుమానం రావడంతో సోమవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం కొడంగల్ ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు వైశాలి సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఎస్ఐ రవిగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



మున్సిపల్ కమిషనర్‌తో సమావేశమైన కాంగ్రెస్‌నేతలు

మేడ్చల్ టౌన్, జూన్ 24: ప్రజా అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మణికంఠ గౌడ్, స్వామి యాదవ్ అన్నారు. వారి సమక్షంలో కాంగ్రెస్ నేతల బృందం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కలిసి పలు అభివృద్ధి పనులపై చర్చించారు. మేడ్చల్ పట్టణంలో దీర్ఘకాలంగా తిష్టవేసిన సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించడానికి కమిషనర్ పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. చెరువుల మరమ్మతు పనులు, డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్‌పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు శంకర్, రామన్నగారి సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో ప్రజావాణి



నాగారంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న టీజేఎస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

కీసర రూరల్, జూన్ 24: సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణిని వినియోగించుకోవాలని నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్లు రాజేందర్ కుమార్, రాజమల్లయ్యలు అన్నారు. ఇరు మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారంలో 10, దమ్మాయిగూడలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో అధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబధించినవి కాగా రోడ్డునిర్మాణం చేపట్టాలని ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు రఘు, చిరంజీవులు, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాంరెడ్డి, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి

కీసర రూరల్, జూన్ 24: బస్తీ దవాకానా వైద్య సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. నాగారంలోని కార్యాలయంలో సోమవారం మాట్లాడుతూ ప్రజావైద్య విస్తరణలో భాగంగా గత ప్రభుత్వం మున్సిపాలిటీల్లో బస్తీ దవాఖానాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఆయా కేంద్రాల్లోని సిబ్బంది వృద్ధులు, మహిళలు, గర్భిణులకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేస్తున్నారని వెల్లడించారు. పైచదువులు కొనసాగిస్తూ కొంత మంది, కుటుంబ పోషణలో భాగస్వాములైన వారు బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్నారన్నారు. గొప్పగా సేవలందిస్తున్న వారికి సకాలంలో వేతనాలు రాకపోవటంతో అవస్థలు పడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు రాక సిబ్బంది రోడ్డెక్కితే ప్రజా వైద్యం కుంటుపడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వారికి సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.